తాగునీటి సమస్యను పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ శ్రేణులు

నిజాంపేట్‌: 21వ డివిజన్‌ శ్రీ సాయినగర్‌, దేవేందర్‌ నగర్‌లో నీటి సమస్యను పరిష్కరించాలని మంగళవారం కమిషనర్‌ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ బాచుపల్లి అధ్యక్షులు ప్రసాద్‌ రాజు సరిపడా తాగు నీటి సరఫరా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పెరిగిన జనాభా దృష్ట్యా నూతన పైపు లైన్‌ వేయాలని కోరారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో సుమన్‌ రావు, నారాయణ మూర్తి, చెన్నరెడ్డి, సురేష్‌, గజ్జిల్లి సంతోష్‌, కాలనీ వాసులు రాజుచారి, నవీన్‌ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సామా జగన్‌మోహన్‌రెడ్డి వర్ధంతి



నివాళి అర్పిస్తున్న నాయకులు

కుత్బుల్లాపూర్‌: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్‌ చింతల్‌ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సామా జగన్‌మోహన్‌రెడ్డి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. శ్రీచైతన్య కళాశాల ప్రాంగణంలో ఆయన చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సంఘం జిల్లా కన్వీనర్‌ నగేష్‌ మాట్లాడుతూ.. కాకతీయ విశ్వవిద్యాలయం నడిబొడ్డున జాతీయ పతాకానికి జరిగిన అవమానాన్ని ఎదిరించి ప్రాణాలర్పించిన మొట్టమొదటి జాతీయవాది సామా జగన్‌ మోహన్‌రెడ్డి అని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్‌ మృత్యుంజయ, నగర సంయుక్త కార్యదర్శి మహేష్‌, దివ్య తదితరులు పాల్గొన్నారు.

రిసోర్స్‌ పర్సన్‌గా గణిత ఉపాధ్యాయుడు



పర్మగళ్ల నర్సిములు

నిజాంపేట్‌: రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చి నిజాంపేట్‌ జడ్పీహెచ్‌ఎస్‌ గణిత ఉపాధ్యాయుడు పర్మగళ్ల నర్సిములు రాష్ట్ర రిసోర్స్‌ పర్సన్‌గా(ఎస్‌ఆర్‌పీ) ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయిలో పాఠశాల విద్యా సంచాలకులు, రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టే ఉపాధ్యాయ శిక్షణలకు ఉపాధ్యాయ కరదీపికల రూపకల్పనలో, పాఠ్య పుస్తకాల రచనల్లో భాగస్వాములవుతూ రాష్ట్ర స్థాయిలో జిల్లా రిసోర్స్‌ పర్సన్స్‌కు శిక్షణ ఇవ్వనున్నారు.

152 మంది ఎంపిక

స్టేట్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ ఎడ్యుకేషనల్‌ రీసెర్చ్‌ అండ్‌ ట్రైనింగ్‌ (ఎస్‌సీఈఆర్టీ)స్టేట్‌ రిసోర్స్‌ పర్సన్స్‌ పోస్టులకు 152 మంది టీచర్లు ఎంపికయ్యారు. మొత్తం 641 మంది టీచర్లు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 393 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. 152 మందిని ఎంపిక చేశారు. వీరిద్వారా టీచర్లకు వివిధ రకాల ట్రైనింగ్స్‌ అందించనున్నారు.

నేటి నుంచి ఆదిశంకర జయంతి ఉత్సవాలు

మోతీనగర్‌: మోతీనగర్‌లోని శ్రీ శృంగేరి శారద శంకరమఠంలో బుధవారం నుంచి మే 2వ తేదీ వరకు ఆది శంకర జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు గురువందనం, గురుపాదుకా పూజ, ఆదిశంకరుల మూలవిరాట్‌కు అభిషేకం, ఆలయంలో నిత్య పూజలు, వివిధ స్తోత్ర పారాయణం, పంచాయతన పూజలు, హోమాలు, శోభాయాత్ర, ప్రవచనం కార్యక్రమాలు ఉంటాయన్నారు.

గందరగోళంగా ఎల్‌ఆర్‌ఎస్‌!

- ఫీజు చెల్లించేందుకు తప్పని అవస్థలు
- అర్జీలకు కొర్రీలు..పరిష్కారానికి ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు
- నేటితో ముగియనున్న 25 శాతం రాయితీ ఫీజు చెల్లింపు గడువు
- మేడ్చల్‌ జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్‌ దరఖాస్తులు 1.65 లక్షలు
- పరిష్కరించినవి 1.15 లక్షలు



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలోని నాలుగు నగర పాలక సంస్థలు, తొమ్మిది మున్సిపాలిటీలు, 34 పంచాయతీల పరిధిలో ఖాళీ స్థలాలను క్రమబద్ధీకరించుకునేందుకు దరఖాస్తు చేసుకున్న స్థల యజమానులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఆదాయం రాబట్టుకునేందుకు ప్రభుత్వం 25 శాతం రాయితీ అవకాశం ఇవ్వగా... ఆ గడువు ఈ నెల 30(బుధవారం)తో ముగుస్తోంది. రాయితీ గడువు మళ్లీ పెంచబోరని అధికార వర్గాల పేర్కొంటుండటంతో... ఆసక్తిగల దరఖాస్తుదారులు ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా... అర్జీలు మాత్రం పూర్తి స్థాయి పరిష్కారానికి నోచుకోవటం లేదు.

దరఖాస్తులకు కొర్రీలు..

లేఅవుట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తుదారులు రూ.25 వేల నుంచి రూ. లక్షల్లో ఫీజు చెల్లించాల్సివస్తోంది. ఈ మొత్తాన్ని చెల్లించేందుకు దరఖాస్తుదారులు ముందుకు వస్తున్నా అర్జీలకు సంబంధిత శాఖలు రకరకాల కొర్రీలు వేస్తుండటంతో వారు నానా అవస్థలు పడుతున్నారు. పైగా అభ్యంతరాలను పరిష్కరించుకునేందుకు కొందరు రిజిస్ట్రేషన్‌, ఇరిగేషన్‌, రెవెన్యూ, పురపాలక సంఘాల ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది.

సమస్యలు ఇవీ..

ఎల్‌ఆర్‌ఎస్‌ దరఖాస్తుదారులు అన్ని పత్రాల(సర్టిఫికెట్ల)తో వెబ్‌సైట్‌లో అప్‌లోడ్‌ చేసిన తర్వాత ఎల్‌–1 అధికారికి వెళ్తున్నాయి. అక్కడ క్షేత్రస్థాయి పరిశీలన, పత్రాలు అప్‌లోడ్‌ చేసిన తర్వాత ఎల్‌–2కి వెళతాయి.ఎల్‌–2లో ఫీజు మదింపు జరగాల్సి ఉండగా..వారి లాగిన్‌లో మళ్లీ ఎల్‌–1 పెండింగ్‌ అని చూపుతున్నాయని దరఖాస్తు దారులు పేర్కొంటున్నారు. అన్నీ సక్రమంగా ఉన్న దరఖాస్తులకు ఫీజు చెల్లించిన వారిలో కూడా కొందరికి పెండింగ్‌ సూచిస్తోందంటున్నారు. ఫీజు చెల్లించిన తర్వాత ఇరిగేషన్‌, రెవెన్యూ, రిజిస్ట్రేషన్‌ శాఖ నుంచి పత్రాలు(సర్టిఫికెట్లు) తీసుకొచ్చి అప్‌ లోడ్‌ చేయాలంటోంది. ప్రక్రియలన్నీ పూర్తయితే మళ్లీ ఎల్‌–1 పెండింగ్‌ వస్తోంది. ఫీజు కట్టిన దరఖాస్తులు వెబ్‌సైట్‌లో కనిపించడం లేదు. అవి ఎక్కడ ఉన్నాయనే విషయం కూడా దరఖాస్తుదారుడికి, లాగిన్‌ అధికారికి తెలియడం లేదని పేర్కొంటున్నారు. పలు పురపాలక సంఘాల పరిధిలో వందలాది దరఖాస్తుదారులకు ఫీజు చెల్లించేందుకు సమాచారం ఇచ్చారు. వీరంతా చెల్లించడానికి వస్తే రకరకాల సమస్యలు ఎదురవుతున్నాయి. ఆయ సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయన్నది ప్రశ్నార్థకంగా మారుతోంది. సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో ముందుకు సాగితే తప్ప ..పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్‌ దరఖాస్తులకు మోక్షం లభించటంతోపాటు సర్కారు లక్ష్యానికి అనుగుణంగా ఆదాయం రాగలదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్‌ దరఖాస్తుల వివరాలు ఇలా

పురపాలక సంఘం	మొత్తం దరఖాస్తులు	పరిష్కారమైనవి
నిజాంపేట	4,269	2,570
బోడుప్పల్‌	17,826	8,896
పీర్జాదిగూడ	9,689	5,028
జవహర్‌నగర్‌	293	154
ఘట్కేసర్‌	30,520	21,837
నాగారం	18,923	15,905
దమ్మాయిగూడ	21,992	15,037
పోచారం	22,655	16,408
దుండిగల్‌	15,156	11902
తూముకుంట	9,151	7,410
గుండ్లపోచంపల్లి	2,501	2,096
కొంపల్లి	2,091	1,431
మేడ్చల్‌	9,946	6,745
మొత్తం	1,65,012	1,15,419

ఫిర్యాదు చేస్తేనే చెట్ల కొమ్మల తరలింపు!



జీడిమెట్ల డివిజన్‌లో చెట్ల కొమ్మలను తరలిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

కుత్బుల్లాపూర్‌: జీడిమెట్ల డివిజన్‌ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఇటీవల చెట్ల కొమ్మలు తొలగించి అక్కడే వేశారు. దీంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ విషయంపై సంబంధిత అధికారులను కలిసిన ప్రయోజనం లేకుండా పోయిందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. కిందిస్థాయి వారు స్పందించకపోవడంతో కుత్బుల్లాపూర్‌ సర్కిల్‌ ఉప కమిషనర్‌ నరసింహకు ఫిర్యాదు చేయగా.. వెంటనే స్పందించి ఆయన ప్రత్యేకంగా స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహించారు. సిబ్బందితో చెట్ల కొమ్మలతోపాటు చెత్త చెదారం తొలగించే ప్రక్రియ చేపట్టారు. దీంతో ఆయా కాలనీల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న అల్వాల్‌ ట్రాఫిక్‌ సీఐ నాగరాజు

కుత్బుల్లాపూర్‌: విద్యార్థులు ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలని అల్వాల్‌ ట్రాఫిక్‌ సీఐ నాగరాజు అన్నారు. మంగళవారం గండిమైసమ్మ పరిధిలోని పలు ఇంజినీరింగ్‌, ఎంబీఏ కళాశాలల హాస్టల్‌ విద్యార్థులకు ట్రాఫిక్‌ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనాలు నడిపే వారు తప్పనిసరిగా డ్రైవింగ్‌ లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. త్రిపుల్‌ డ్రైవింగ్‌, ఫోన్‌ మాట్లాడుతూ డ్రైవింగ్‌ చేయడం నేరమని వివరించారు. ఎవరైనా పట్టుబడితే చలాన్‌లు విధించడంతో పాటు కేసులు నమోదు చేస్తామన్నారు. ట్రాఫిక్‌ నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా గమ్యాలకు చేరుకోవాలని సూచించారు. అదే విధంగా రోడ్లను జీబ్రా క్రాసింగ్‌ల వద్ద దాటాలని, సిగ్నల్స్‌ లేనిచోట దాటాల్సి వస్తే చేతులు చూపుతూ దాటాలన్నారు.

మున్సిపల్‌ కార్యాలయంలో మహిళలపై వేధింపులు!

అసభ్య పదజాలంతో ఇబ్బంది పెడుతున్న ఓ అధికారి



నిజాంపేట్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ కార్యాలయం

నిజాంపేట్‌: నిజాంపేట్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ కార్యాలయంలో ఓ అధికారి మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు కార్యాలయంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. విధి నిర్వహణలో అనవసరమైన విషయాలను మాట్లాడుతూ వారి పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు మహిళా నాయకుల వద్ద బాధితులు వాపోతున్నారు. తమ ఇండ్లలో భర్తలు సైతం మాట్లాడలేని భాషను ఇక్కడ ఆ అధికారి ఉపయోగిస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెప్పిన మాట వినకుంటే వీపులు చింతపండు అవుతాయంటూ రకరకాల మాటలను మాట్లాడుతూ మహిళా ఉద్యోగులను హింసిస్తున్నట్లు బాధితులు పేర్కొన్నారు. మహిళా ఉద్యోగుల పట్ల ఇలా ఉన్న ఆ అధికారి మున్సిపల్‌ కార్పొరేషన్‌ కార్యాలయానికి వివిధ పనులపై బయట నుంచి వచ్చే మహిళల పట్ల ఏ విధంగా ప్రవర్తిస్తున్నారోనని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు ఈ విషయంలో జోక్యం చేసుకొని మహిళలను వేధిస్తున్న సదరు అధికారిపై పూర్తి విచారణ చేసి చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాల నేతలు కోరుతున్నారు.

వాకింగ్‌కు వెళ్లి.. చెరువులో శవమై తేలి..

కుత్బుల్లాపూర్‌: వాకింగ్‌కు వెళ్లిన వ్యక్తి చెరువులో శవమై తేలిన ఘటన పేట్‌బషీరాబాద్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్‌ గ్రామానికి చెందిన ఏనుగుల రాజశేఖర్‌(43) ఈ నెల 27న సాయంత్రం 6 గంటలకు వాకింగ్‌ చేసేందుకు బయటకు వెళ్లాడు. అయితే రాత్రైనా అతను ఇంటికి చేరుకోకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం మధ్యాహ్నం వెన్నెల గడ్డలోని ఎన్నా చెరువులో ఓ మృతదేహం తేలిందని పేట్‌బషీరాబాద్‌ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికి తీశారు. అయితే సదరు వ్యక్తిని రాజశేఖర్‌గా కుటుంబ సభ్యులు గుర్తించారు. డయాబెటీస్‌ పేషెంట్‌ కావడంతో ఇటీవల జరిగిన ఆపరేషన్‌ ఫెయిల్‌ అయ్యిందని, డిప్రెషన్‌కు లోనై ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

కుత్బుల్లాపూర్‌: ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. బిహార్‌ రాష్ట్రానికి చెందిన మల్లేష్‌ మహతో(40) కుటుంబ బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చి దేవరయాంజాల్‌లో నివాసముంటోంది. కూలీ పనులు చేసుకుని జీవనోపాధి పొందుతున్న మల్లేష్‌ మహతో గత కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధ పడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 28న రాత్రి 8.30 గంటల సమయంలో ఇంటి దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఐదుగురు పిల్లలున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలి

అదనపు కలెక్టర్‌ రాధికాగుప్తా



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్‌

దుండిగల్‌: ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని జిల్లా అదనపు కలెక్టర్‌ రాధికా గుప్తా అన్నారు. దుండిగల్‌ మున్సిపాలిటీ గాగిల్లాపూర్‌ తండాలోని డంపింగ్‌ యార్డును మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దుండిగల్‌, నిజాంపేట కార్పొరేషన్ల పరిధిలోని చెత్తను దుండిగల్‌లోని రాంకీకి తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా స్థానికంగా ఉన్న డంపింగ్‌ యార్డు చుట్టు ప్రహరీ నిర్మించాలని ఆదేశించారు. కార్యక్రమంలో దుండిగల్‌, నిజాంపేట్‌ మున్సిపాలిటీల కమిషనర్లు వెంకటేశ్వర్‌ నాయక్‌, సాబేర్‌ అలీ, తహసీల్దార్లు సయ్యద్‌ మతిన్‌, పూల్‌సింగ్‌, మున్సిపల్‌ అధికారులు పాల్గొన్నారు.

గురుకులాలు నిరుపేద విద్యార్థులకు వరం

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌



విద్యార్థినిని అభినందిస్తున్న ఎమ్మెల్యే

కుత్బుల్లాపూర్‌: నిరుపేద కుటుంబాల్లో పుట్టి ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న విద్యార్థులను చూస్తుంటే గర్వంగా ఉందని, గురుకులాలు నిరుపేద విద్యార్థులకు వరం అని కుత్బుల్లాపూర్‌ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ అన్నారు. ఇటీవల వెలువడిన ఇంటర్‌ ఫలితాల్లో రెండవ సంవత్సరంలో జగద్గిరిగుట్ట డివిజన్‌ మగ్దూంనగర్‌ ప్రాంతానికి చెందిన ఇప్రాతున్నిసా 991/1000 మార్కులు సాధించి రాష్ట్రంలో ఐదవ ర్యాంక్‌ సాధించింది. నిరు పేద కుటుంబానికి చెందిన ఆమె గురుకుల పాఠశాలలో విద్యను అభ్యసించింది. తండ్రి ఇర్ఫానుద్దీన్‌ పాన్‌ షాపు, తల్లి సఫియా సుల్తానా ఔట్‌ సోర్సింగ్‌ ఉద్యోగిగా గురుకుల పాఠశాలలో పని చేస్తుంది. మంగళవారం సదరు విద్యార్థిని తన తల్లిదండ్రులతో కలిసి ఎమ్మెల్యేను కలిసింది. ఎమ్మెల్యే ఆమెను అభినందించారు. భవిష్యత్‌లో చదువు కోసం తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో అజం, సురేష్‌రెడ్డి, వేణు యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

లేబర్‌ కార్డు ఉండేలా చర్యలు తీసుకోవాలి



ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సుదర్శన్‌రెడ్డి

కుత్బుల్లాపూర్‌: అర్హులైన భవన నిర్మాణ, అసంఘటిత రంగ కార్మికులకు లేబర్‌ కార్డు ఉండేలా చట్టంలో మార్పులు తేవాలని టీపీసీసీ లేబర్‌ సెల్‌ జిల్లా అధ్యక్షుడు కందాడి సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని ఆయన కూకట్‌పల్లి నియోజకవర్గ లేబర్‌ సెల్‌ అధ్యక్షుడు భాస్కర్‌తో కలిసి వినతిపత్రం అందజేశారు. అర్హులైన ప్రతి గృహనిర్మాణ కార్మికుడికి తప్పనిసరిగా వెల్ఫేర్‌ కార్డు ఉంటేనే పని కొనిసాగించాలని, లేనిపక్షంలో కార్మిక చట్టం ప్రకారం చర్యలు ఉంటాయని ఉత్తర్వులు జారీ చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని అన్నారు.

కార్యకర్తలే కాంగ్రెస్‌కు బలమైన పునాది

- కష్టపడే వారికి గుర్తింపు
- టీపీసీసీ అబ్జర్వర్‌ పారిజాత నర్సింహారెడ్డి



మౌనం పాటిస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

సుభాష్‌నగర్‌: కాంగ్రెస్‌ పార్టీకి కార్యకర్తలే బలమైన పునాది అని, పార్టీ అభివృద్ధి కోసం కష్టపడే వారికి గుర్తింపు వస్తుందని టీపీసీసీ అబ్జర్వర్‌ పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. గ్రామ సంఘటిత్‌ సాల్‌లో భాగంగా కుత్బుల్లాపూర్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ పార్టీ విస్తృతస్థాయి సమావేశం మంగళవారం బహదూర్‌పల్లి మేకల వెంకటేష్‌ ఫంక్షన్‌ హాల్‌లో జరిగింది. సమావేశానికి కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ముందుగా పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన పర్యాటకులకు నివాళి అర్పించి మౌనం పాటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌, నియోజకవర్గ మిన్‌చార్జి కొలన్‌ హన్మంతరెడ్డి గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్‌ శ్రీనివాస్‌ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి, మహిళా అధ్యక్షురాలు ఆర్‌.లక్ష్మి, కాంగ్రెస్‌ శ్రేణులు పాల్గొన్నారు.




సమావేశానికి హాజరైన కార్యకర్తలు

అక్రమ నిర్మాణాల కూల్చివేత

సుభాష్‌నగర్‌: గాజులరామారం గాలి పోచమ్మబస్తీ సర్వే నంబర్‌ 307లో వెలిసిన అక్రమ నిర్మాణాలను కుత్బుల్లాపూర్‌ రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. స్థానికంగా ఉన్న సర్వే నంబర్‌ 307 లో రాత్రికి రాత్రి నిర్మాణాలు చేపట్టారని సమాచారం రావడంతో స్థానిక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ గులాం కలీం నేతృత్వంలో మంగళవారం జగద్గిరిగుట్ట పోలీసుల భద్రత మధ్య ఐదు గదులను నేలమట్టం చేశారు. సదరు స్థలంలో నిర్మాణాలు చేపడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

ట్రాఫిక్‌ సిగ్నల్‌ ఏర్పాటు చేయండి!



జగద్గిరిగుట్ట: ట్రాఫిక్‌ సిగ్నల్‌ లేక షాపూర్‌నగర్‌ చౌరస్తా వద్ద ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. జంక్షన్‌ అభివృద్ధి నేపథ్యంలో ట్రాఫిక్‌ సిగ్నల్‌ను 2 నెలల క్రితం తొలగించారు. ఈ చౌరస్తాలో గాజులరామారం నుంచి చింతల్‌ వెళ్లే వాహనాదారులు ఇక్కడికి రాగానే ట్రాఫిక్‌ సిగ్నల్‌ లేక అయోమయానికి గురవుతున్నారు. వాహనాలు అడ్డదిడ్డంగా వస్తున్న క్రమంలో ప్రమాదాలు జరిగే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికైనా అధికారులు సిగ్నల్‌ ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ఫెన్సింగ్‌ ఏర్పాటు చేయరూ!



జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట వార్డు కార్యాలయంలో ఉన్న విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫెన్సింగ్‌ (కంచె) లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. నిత్యం ఈ వార్డు కార్యాలయానికి వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి వందలాది మంది వస్తుంటారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. అధికారులు ప్రమాదం జరుగకముందే స్పందించి కంచెను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

బస్తీ దవాఖానాలో మందుల కొరత!

- ఇబ్బంది పడుతున్న పేద ప్రజలు
- పట్టించుకోని అధికారులు



శ్రీనివాస్‌ నగర్‌ మీసేవా కేంద్రంలోని బస్తీ దవాఖానా

జగద్గిరిగుట్ట: బీద, మధ్య తరగతి ప్రజల కోసం ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాలు అర కొర మందులతో కొనసాగుతున్నాయి. దీంతో దవాఖానకు వచ్చే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. పేద ప్రజలకు వైద్య సేవలందడం కోసం బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం బస్తీ దవాఖానాలను అందుబాటులోకి తెచ్చింది. వసతులు లేకపోవడంతో నేడు సరైన సేవలు అందడం లేదని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

అరకొర మందులతో..

బస్తీలు ఎక్కువగా ఉండే ఈ డివిజన్‌లలో 2023 డిసెంబర్‌లో 2 బస్తీ దవాఖానాలు ప్రారంభించారు. శ్రీనివాస్‌ నగర్‌ మీసేవా కేంద్రంలో ఒకటి, రాజీవ్‌ గృహకల్ప సముదాయంలో మరొకటి ఏర్పాటు చేశారు. ప్రతీ రోజు ఈ బస్తీ దవాఖానాలో సుమారు 80 నుంచి 90 మంది వైద్య సేవలు పొందుతారు. అందులో దగ్గు, జలుబు, జ్వరం తదితర మందులు సరిపడా లేక వచ్చిన వారు ఇబ్బందులు పడుతున్నారు. చంటిపిల్లలకు జలుబు, దగ్గు మందులు, సిరప్‌లు లేక వచ్చే తల్లిదండ్రులు వెనుదిరుగుతున్నారు. బీపీ, షుగర్‌ పరీక్షలు ఇక్కడ చాలా మంది చేయించుకుంటున్నారు. వీరికి 10 రోజుల సరిపడా మందులు కూడా ఇవ్వడం లేదు.

బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

బస్తీ దవాఖానాకు వచ్చే వారికి సరైన మందులు అందడం లేదు. దీంతో అక్కడ విధుల్లో ఉన్న వారితో గొడవ పడుతున్నారు. ఒక్కొక్కసారి పరిస్థితి చేయి దాటిపోతుంది. ఇటీవలే శ్రీనివాస్‌ మీసేవా కేంద్రంలోని దవాఖాన వద్ద ఓ వ్యక్తి గొడవ పడి సిబ్బంది మొబైల్‌ లాక్కొని కొట్టేంత పని చేశాడు. పక్కనే ఉన్న మీసేవా కేంద్రం సిబ్బంది వచ్చి అతడిని బయటకు పంపారు. అలాగే రాజీవ్‌ గృహకల్ప సముదాయంలో ఉన్న బస్తీ దవాఖానాకు బీపీ, షుగర్‌ టాబ్లెట్ల విషయమై చుట్టు పక్కల బస్తీల నుంచి మద్యం తాగి తమతో గొడవ పడుతున్నారని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేధిస్తున్న కొరత

రాజీవ్‌ గృహకల్ప సముదాయంలో ఉన్న బస్తీ దవాఖానకు ఇప్పటి వరకు ముగ్గురు డాక్టర్లు మారారు. గత నెల రోజుల నుంచి ఇక్కడ మెడికల్‌ ఆఫీసర్‌ని నియమించలేదు. స్టాఫ్‌ నర్సు ఇక్కడ పూర్తిగా విధులు నిర్వహిస్తున్నారు. సరిపడా మందులు లేక వచ్చేవారికి సమాధానం చెప్పలేక చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సరైన మందులు, వైద్య సేవలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.